సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం : 8 : జనవరి : 2025



ఉన్నత విద్య అందాలి
ఆదివాసీ, గిరిజన బాలబాలికలందరికీ ఉన్నత విద్య అందాలని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు.
- 8లో



దొంగల ముఠా అరెస్ట్
తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు.
- 8లో



తాళం వేసిన ఇంట్లో చోరీ
మిర్యాలగూడ, వేములపల్లిలో తాళం వేసి ఉన్న ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు భారీ చోరీకి పాల్పడ్డారు.
- 8లో

న్యూస్‌రీల్

బాలకార్మికులకు విముక్తి

చౌటుప్పల్ రూరల్: బాలకార్మికుల వ్యవస్థను కట్టడి చేసేందుకు రాచకొండ పోలీసులు ఆపరేషన్ స్మైల్ 11 కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం చౌటుప్పల్ మండలంలోని కొయ్యలగూడెం గ్రామంలో బిల్డింగ్ పనులు చేస్తున్న ఓ బాలుడిని, బేకరి, మెకానిక్ షాపులో పని చేస్తున్న ఇద్దరు బాలుల్ని పోలీసులు గుర్తించి బాలల సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించారు. బాలకార్మికులతో పని చేయిస్తున్న యాజమానులు మెకానిక్ గౌస్, బేకరి నిర్వాహకులు కేసబోయిన సత్యనారాయణ, బిల్డింగ్ నిర్మాణ పనులు చేయిస్తున్న కంది బాల్‌రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణ తెలిపారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన

మోత్కూరు: మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామంలో రూ.12 కోట్లతో చేపట్టిన అమృత్ 2.0 పనులను మంగళవారం పబ్లిక్ హెల్త్ ఈఈ సత్యనారాయణ, డీఈ మనోహర్ పరిశీలించారు. వారి వెంట పబ్లిక్ హెల్త్ ఈఈ సురేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ ఉన్నారు.

నేటి నుంచి చతురాయన సహిత చండీయాగం

ఆలేరురూరల్: ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామంలో గల శ్రీమాతా పితృ గోక్షేత్రంలో బుధవారం నుంచి 12వ తేదీ వరకు చతురాసన సహిత శత చండీయాగం నిర్వహించనున్నట్లు చండీయాగం నిర్వాహకులు పులి సీతారామశర్మ మంగళవారం తెలిపారు. ఈ యాగాన్ని హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 9న శ్రీలక్ష్మీనారసింహ, సుదర్శన, పవమాన హోమం, 10న అరుణ సరస్వతి స్వామిజీ అనుగ్రహ భాషనం, 11న రుద్ర హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లిలో బుధవారం నేషనల్ హెల్త్‌మిషన్ (న్యూఢిల్లీ) అధికారుల బృందం పర్యటించనుంది. పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్యం మందిరంతో పాటు ముక్తాపూర్‌లో ఎన్‌సీడీ వ్యాధుల నియంత్రణ కార్యక్రమం అమలును పరిశీలించనున్నట్లు మండల వైద్యాధికారిణి శ్రీవాణి మంగళవారం తెలిపారు.

పోరాటాల ఫలితంగానే మంత్రి హామీ

భువనగిరి: ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగానే సివిల్ సప్లయ్ హమాలీల సమస్యల పరిష్కారానికి మంత్రి ఉత్తమ్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ తెలిపారు. సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గత వారం రోజుల నుంచి చేస్తున్న సమ్మెలో భాగంగా మంగళవారం పట్టణంలోని గోడౌన్ వద్ద బియ్యం సప్లయ్‌ని వారు అడ్డుకున్నారు. అనంతరం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో జరిగిన సమావేశంలో మంత్రి ఇచ్చిన హామీతో వారు సమ్మె విరమించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సాలమ శోభన్‌బాబు, సివిల్ సప్లయ్ హమాలీ కార్మిక భువనగిరి పాయింట్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలో చేపట్టిన అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా ఉపాధి కోల్పోతున్న చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, జిల్లా కార్యదర్శి ఆలె చిరంజీవి డిమాండ్ చేశారు. చిరువ్యాపారులతో కలిసి మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్, మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, మల్లేషం, భూపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అశోక్, జంగయ్య పాల్గొన్నారు.



రైతు భరోసా రూ.15వేలు ఇవ్వాలి

ఎకరానికి ప్రతి ఏటా రూ.15వేలు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు - యాదగిరిగుట్ట

రిజర్వేషన్లపై ఉత్కంఠ!

- సర్పంచ్ ఎన్నికలకు సిద్ధమవుతున్న యంత్రాంగం
- రిజర్వేషన్ల కోసం ఆశావహుల ఎదురుచూపు
- ఇప్పటికే ప్రజలతో మమేకమై భారీగా ఖర్చు



గ్రామ పంచాయతీలు :	426
వార్డు సభ్యులు :	3,698
మొత్తం ఓటర్లు :	5,28,485
మహిళలు :	2,65,659
పురుషులు :	2,62,822

సాక్షి యాదాద్రి : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న వారు.. ప్రభుత్వం ప్రకటించనున్న రిజర్వేషన్ల వైపు ఆశగా చూస్తున్నారు. ప్రతి గ్రామంలో సర్పంచ్ పదవికి ఆశావహుల సంఖ్య ఎక్కువగానే ఉంది. వీరంతా ప్రజల మద్దతు కూడగట్టుకునేందుకు ఇప్పటికే వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ భారీగా ఖర్చు చేస్తున్నారు. ఇటీవల చేపట్టిన కులగణన సర్వే నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతనే గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఆశావహుల్లో గుబులు నెలకొంది. రిజర్వేషన్ ఏది వస్తుందో అంచనా వేయలేకపోతున్నారు.

ప్రధాన పార్టీల్లో భారీగా ఆశావహులు

అధికార కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీల నుంచి సర్పంచ్ స్థానానికి పోటీ చేయాలని ఆశిస్తున్న వారి సంఖ్య భారీగానే ఉంది. ప్రధానంగా ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో గ్రామస్థాయిలో క్రియాశీలకంగా వ్యవహరించిన నేతలు టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ విషయానికొస్తే.. రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఆ పార్టీలోకి వలసలు పెద్దఎత్తున జరిగాయి. వివిధ పార్టీల క్రియాశీలక నేతలు కాంగ్రెస్ లోకి చేరారు. వీరికితోడు కాంగ్రెస్ పార్టీకి మొదటినుంచి వెన్నంటి ఉన్నవారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

అంచనా వేయలేని పరిస్థితి

రిజర్వేషన్లపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గతంలో రిజర్వేషన్ల కేటాయింపు ఎలా ఉంటుందో ముందుగానే ఊహించే అవకాశం ఉండేది. గడిచిన నాలుగైదు పర్యాయాలు వచ్చిన రిజర్వేషన్లను బేరీజు వేసుకుని, ఆ తర్వాత ఎన్నికల్లో తమ గ్రామానికి పలానా రిజర్వేషన్ వస్తుందని కచ్చితంగా చెప్పగలిగేవారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకసారి ఖరారు చేసిన గ్రామ పంచాయతీ రిజర్వేషన్లను వరుసగా పదేళ్లపాటు (రెండు టర్ములు) కొనసాగించింది. అయితే జనాభాలో అధిక సంఖ్యాకులుగా ఉన్న బీసీలకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందని, జనాభాకు అనుగుణంగా సీట్లు దక్కడం లేదని కొంతకాలంగా బీసీ వర్గాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. ఈ మేరకు అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో అప్పటి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించారు. ఆ మేరకు ప్రభుత్వం ఇటీవల కులగణన సర్వే చేపట్టింది. దీని ఆధారంగానే మళ్లీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల్లోకి వెళ్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఏ గ్రామ సర్పంచ్ పదవికి.. ఏ రిజర్వేషన్ వర్తిస్తుందో చెప్పలేకపోతున్నారు.

పెద్దఎత్తున ఖర్చు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ అనే తేడా లేకుండా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ ఆశావాహులు సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎవరిని పలకరించినా సర్పంచ్ స్థానానికి అభ్యర్థిగానే మాట్లాడుతూ చర్చలు జరుపుతున్నారు. వార్డు సభ్యుల స్థానానికి అంతగా పోటీ లేకపోయినప్పటికీ, సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులపైనే ఎక్కువగా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. జనంలో ఉంటూ పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తూ వారి మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే పెద్దఎత్తున ఖర్చు చేయడం ప్రారంభించారు.

ద్వితీయ శ్రేణి హంగామా

సర్పంచ్ పదవుల రిజర్వేషన్ స్థానాన్ని బట్టి ఆ తర్వాత జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఎన్నికలపై ఒక నిర్ధారణకు రావొచ్చని పలువురు నాయకులు భావిస్తున్నారు. వీరంతా ప్రభుత్వం ప్రకటించనున్న రిజర్వేషన్ల వైపే ఆశగా చూస్తున్నారు. ఫిబ్రవరిలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులపై కన్నేసిన ద్వితీయ శ్రేణి లీడర్ల హంగామా పెరిగింది.

ప్రారంభమైన బ్యాలెట్ పేపర్ల ముద్రణ

నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే బ్యాలెట్ పేపర్ల ముద్రణ ప్రారంభించారు. 30 గుర్తులతో బ్యాలెట్ పేపర్ల ముద్రణ చేస్తున్నారు. సర్పంచ్‌లకు ఆరు లక్షలు, వార్డు సభ్యులకు 6 లక్షల చొప్పున బ్యాలెట్ పేపర్లను ముద్రిస్తున్నారు. ఈ బ్యాలెట్ పేపర్ల ముద్రణ మరో వారం, పది రోజుల్లో పూర్తికానుంది. ఇప్పటికే వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల ప్రకటన జరిగింది. ఎన్నికల నోడల్ అధికారులను కూడా నియమించారు. వార్డుల వారీగా ఓటర్ల జాబితాను రూపొందించారు. అవసరమైన పోలింగ్ బాక్స్‌లను సిద్ధం చేశారు. ఎన్నికల నిర్వహణకు పీఓలు, ఏపీఓల జాబితాను సిద్ధం చేస్తున్నారు.

మున్సిపాలిటీలకు ఊరట

- విడుదల కానున్న స్టాంప్ డ్యూటీ నిధులు
- ఏయే పనులకు ఎన్ని నిధులు ఖర్చు చేయాలో జారీ కానున్న ఉత్తర్వులు



భువనగిరిటౌన్: మున్సిపాలిటీల పాలకవర్గ పదవీకాలం ఈ నెల 27న ముగియనుంది. ఈ నేపథ్యంలోనే స్టాంప్ డ్యూటీ నిధులను విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రెండు, మూడు రోజుల్లో మున్సిపాలిటీల ఖాతాల్లో జమ చేయనుంది. ఈ నిధులు ఏయే పనులకు ఖర్చు చేయాలో గైడెన్స్ కూడా ప్రభుత్వం విడుదల చేయనుంది.

మున్సిపాలిటీల వారీగా జమకానున్న నిధులు ఇలా..

మున్సిపాలిటీ	నిధులు
భువనగిరి	రూ. 25కోట్లు
మోత్కూర్	రూ.1.52 కోట్లు
చౌటుప్పల్	రూ. 11.96 కోట్లు
ఆలేరు	రూ. 3.98 కోట్లు
పోచంపల్లి	రూ. 4.70 కోట్లు
యాదగిరిగుట్ట	రూ. 3.11 కోట్లు

గతంలో 4శాతం నిధులు

స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్టాంప్ డ్యూటీని గతంలో 4 శాతం స్థానిక సంస్థల ఖాతాల్లో నేరుగా జమ చేసేవారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ నిధులను మున్సిపాలిటీలకు ఇవ్వకుండా ప్రభుత్వం నేరుగా తీసుకుంది. ఆ తరువాత పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి పేరుతో ప్రతినెలా కొన్ని నిధులను స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేసింది. వీటితో ఆయా మున్సిపాలిటీలు, పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పట్టణ ప్రగతి, పల్లెప్రగతి కార్యక్రమాలను నిలిపివేశారు. దీంతో నిధులులేక మున్సిపాలిటీల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఇప్పటికే పనులు చేసిన కాంట్రాక్టర్లకు సైతం రూ.కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

హనుమంతుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగాయి. శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించి, వెండి జోడు సేవ పూజలు నిర్వహించారు.

విధుల్లోకి సమగ్ర శిక్ష ఉద్యోగులు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో చర్చల అనంతరం సమ్మె విరమణ

భువనగిరి: సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెను తాత్కాలికంగా విరమించి మంగళవారం విధుల్లో చేరారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పే స్కేల్ వర్తింపజేయాలని, రూ.20 లక్షలు జీవిత బీమా, రూ.10లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ గత డిసెంబర్ 10వ తేదీ నుంచి సమ్మెకు దిగారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్, భవిత కేంద్రాలతో పాటు ఎంఈఓ, డీఈఓ కార్యాలయంలో బోధన, బోధనేతర సిబ్బంది 742 మంది ఉండగా.. రోజువారీగా వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. దీంతో అధికారులు కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్, భవిత కేంద్రాల్లోని విద్యార్థుల చదువులపై ప్రభావం పడకుండా 77 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. ఎమ్మార్సీల్లో తాత్కాలికంగా విధులు నిర్వహించేందుకు ప్రతి ఎమ్మార్సీకి ఇద్దరు చొప్పున మొత్తం 34 మంది స్ట్రాంగ్ ఉపాధ్యాయులను నియమించారు. ఎట్టకేలకు ఈ నెల 6న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో జరిగిన చర్చలు సఫలం కావడంతో ఉద్యోగులు తాత్కాలికంగా సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. ఈమేరకు మంగళవారం నుంచి ఉద్యోగులు తిరిగి విధుల్లో చేరారు.

బీసీల త్యాగాలు వెలకట్టలేనివి



యాదగిరిగుట్టలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు.

- రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు

యాదగిరిగుట్ట: స్వాతంత్ర్య ఉద్యమం నుంచి తెలంగాణ ఉద్యమం వరకూ బీసీల త్యాగాలు, పోరాటాలు వెలకట్టలేనివని రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు అన్నారు. బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా అభివృద్ధి చెందేలా వారిని చైతన్యం చేసేందుకు మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలో కార్యనిర్వాహకుడు కటకం నర్సింగ్‌రావు అధ్యక్షతన మన ఆలోచన - సమాలోచన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు మాట్లాడుతూ.. విద్యావంతులు, సమాజాన్ని పరివర్తన వైపు నడిపించేవారు, మేధావులు, రాజకీయాల్లో ఉన్న బీసీలు ఒకటి కావాలని పిలుపునిచ్చారు. వృత్తి కులాల వారంతా ఏకమై మనలోని లోపాలను తొలగించుకుంటూ రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలన్నారు. బీసీలు ఓటు విలువ తెలుసుకోవాలన్నారు. తెలంగాణలో మరో ఉద్యమం జరగాలని, అది బీసీ ఉద్యమం కావాలన్నారు. సామాజిక తెలంగాణ కోసం సమర శంఖం పూరించడానికి ఇలాంటి శిక్షణ శిబిరాలు దోహదపడుతాయన్నారు. శిబిరం సంచాలకులుగా గడ్డం నర్సింహగౌడ్, అంశాల ప్రముఖ్‌గా దొంత ఆనందం, ప్రముఖ్‌గా దేవేందర్‌జీ వ్యవహరించారు. శిబిరంలో ప్రొఫెసర్ శ్రీనివాసులు, కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొంగ వీరస్వామి, వీజీఆర్ నారగోని, విద్యా వెంకట్, వెంకటనారాయణ, పిడికిలి రాజు, చింత స్వామి, ఒంటెద్దు నరేందర్, పూజ నర్సింహ, బత్తుల సిద్దేశ్వర్, గుండ్ల ఆంజనేయులుగౌడ్, పంతుల మధుబాబు, కొమురయ్య, వేమునూరి మురళీధర్‌చారి, సింగజ్యోగి శ్రీనివాస్, చాపర్తి కుమార్ గాడ్గే, దశరథ్ సాగర్, సిలివేరు శంకర్ ప్రజాపతి, బచ్చనబోయిన శ్రీనివాస్ యాదవ్, పోలగోని శ్రీనివాస్‌గౌడ్, పెండ్యం లక్ష్మణ్, శ్రీనివాస ముదిరాజ్, శ్యామల యాదగిరి వంశరాజ్, బాలరాజు పాల్గొన్నారు.

గాంధీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం


- గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ట్రస్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న యానాల ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్: మహాత్మాగాంధీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ట్రస్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 18న చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని గాంధీపార్క్ స్థలంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నామన్నారు. చరకా ప్రదర్శన, బాల గాంధీ వేషధారణ, గాంధీజీ 500 విగ్రహాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేస్తామని, మల్కంబ్, యోగా ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మండల అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీబీ కృష్ణారావు, మండల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఉజ్జిని మంజుల, కోశాధికారి పోలోజు శ్రీలత, ప్రతినిధులు బొబ్బిళ్ల సంధ్య, ముటుకుల్లోజు నీరజ, జయ, పద్మావతి, ఝాన్సీరాణి, మమత, రజిత, అయిలమ్మ, రమాదేవి, అనూష, షామిని, సువర్ణలక్ష్మి, కీర్తన, నవనీత పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కన్వీనర్‌గా సుర్వి మణికంఠ



సుర్వి మణికంఠ

భువనగిరి: ఏబీవీపీ రాష్ట్ర కన్వీనర్‌గా భువనగిరి పట్టణానికి చెందిన సుర్వి మణికంఠ నియామకమయ్యారు. సిద్దిపేటలో గత డిసెంబర్ 23 నుంచి 25 వరకు జరిగిన ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభల్లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కా జానారెడ్డి నియామక ఉత్తర్వులు అందజేశారు. ప్రస్తుతం ఉమ్మడి నల్లగొండ జిల్లా కన్వీనర్‌గా ఉన్న మణికంఠ రాష్ట్ర కన్వీనర్‌గా నియామకమయ్యారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామని ఆయన తెలిపారు.

సంక్రాంతికి 400 ప్రత్యేక బస్సులు

- పండుగ వేళ ప్రయాణికుల సౌకర్యార్థం నడపనున్న ఆర్టీసీ
- రద్దీకి అనుగుణంగా రూట్ల వారీగా బస్సులు
- 9 నుంచి 13 తేదీ వరకు.. తిరిగి 15 నుంచి 20 వరకు..
- ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు

ఏ డిపో నుంచి ఎన్ని బస్సులంటే..

డిపో	బస్సులు
దేవరకొండ	57
నల్లగొండ	66
నార్కట్‌పల్లి	20
మిర్యాలగూడ	70
సూర్యాపేట	93
యాదగిరిగుట్ట	64
కోదాడ	30



రామగిరి(నల్లగొండ), మిర్యాలగూడ టౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపేందుకు సిద్ధమైంది. తద్వారా ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల బాట పట్టించేందుకు యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. రాష్ట్ర రాజధాని తోపాటు, వివిధ ప్రధాన పట్టణాలు, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు తమ సొంత ఊర్లకు వచ్చి వెళ్లేందుకు ఇబ్బందులు కలగకుండా ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా పండుగకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు పూనుకుంది. మరోవైపు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ప్రయాణికులతో బస్సుల్లో రద్దీ నెలకొననున్న నేపథ్యంలో రూట్ల వారీగా బస్సులను నడిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఏ డిపో నుంచి ఎన్ని బస్సులు నడిపించాలో కూడా ఇప్పటికే నిర్ణయించారు. స్పెషల్ బస్సుల్లో ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులు ఉండనున్నాయి. పండుగ సందర్భంగా నడిపే ప్రత్యేక బస్సుల ద్వారా అదనపు చార్జీలు వసూలు చేసే యోచనలో సంస్థ ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం.

ఏడు డిపోల నుంచి..

నల్లగొండ రీజియన్ పరిధిలోని దేవరకొండ, మిర్యాలగూడ, కోదాడ, సూర్యాపేట, నార్కట్‌పల్లి, యాదగిరిగుట్ట, నల్లగొండ డిపోల నుంచి మొత్తం 400 బస్ సర్వీసులను నడిపించేందుకు ఆర్టీసీ అధికారులు కసరత్తు చేశారు. ఈనెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు, తిరిగి 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఆర్టీసీ బస్సులను నడపనున్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర ప్రాంతాలకు ప్రయాణికులకు రద్దీని బట్టి బస్సులను నడిపిస్తారు. ముఖ్యంగా 9వ తేదీన 38, 10న 110, 11న 130, 12న 90, 13న 32 బస్సులను నడపనున్నారు. ప్రధానంగా హైదరాబాద్‌లో ఎల్‌బీ నగర్ బస్టాండ్ వద్ద జిల్లాకు చెందిన ఇద్దరు డిపో మేనేజర్‌లతో పాటు డిప్యూటీ ఆర్ఎం స్థాయి వారిని సిబ్బందిగా నియమించారు.

ప్రయాణికులకు ఇబ్బందులు కలగనీయం




సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం నల్లగొండ రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపేలా అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే మా లక్ష్యం. బస్సులకు రిజర్వేషన్ల అవకాశం కూడా కల్పించాం. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం. చార్జీల పెంపుపై ఎలాంటి నిర్ణయం జరగలేదు. ఒకవేళ సంస్థ నిర్ణయం తీసుకుంటే చార్జీల పెంపు ఉంటుంది.

– జానిరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం, నల్లగొండ

వైద్యశాఖ అప్రమత్తం

- హెచ్ఎంపీవీ నేపథ్యంలో జిల్లా అధికారులను అప్రమత్తం చేసిన వైద్యశాఖ
- అంత ప్రమాదకరం కానప్పటికీ జాగ్రత్తలు పాటించాలని సూచన



భువనగిరి: హెచ్ఎంపీవీ(హ్యూమన్ మెటా నిమో వైరస్) ఇప్పుడు అంతటా ఆందోళన కలిగిస్తోంది. ఈక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్య శాఖ అధికారులను అప్రమత్తం చేసింది. ఈ వైరస్ అంత ప్రమాదకరం కానప్పటికీ ఐదేళ్ల లోపు పిల్లలు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈమేరకు పాటించాల్సిన జాగ్రత్తలను జిల్లా వైద్యాధికారులు ప్రకటించారు.

హెచ్ఎంపీవీ లక్షణాలు

హెచ్ఎంపీవీ సోకితే జలుబు, జ్వరం, దగ్గు, ముక్కుదిమ్మడ, శ్వాసకోశ వ్యవస్థలో సమస్యలు వస్తాయి. ఈ లక్షణాలు 3 నుంచి 6 రోజుల్లో కనిపిస్తాయి. ఈ వైరస్ చలి కాలంలో వ్యాప్తికి ఎక్కువగా అవకాశం ఉంటుంది. దగ్గు, తుంపర్లు, తుమ్మడం ద్వారా ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

ఆందోళన చెందొద్దు

హెచ్ఎంపీవీతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అయినా అప్రమత్తంగా ఉండడం మంచిది. హెచ్ఎంపీవీ వల్ల జలుబు, జ్వరం, ముక్కుదిమ్మడ, శ్వాసకోస సంబంధ సమస్యలు ఉంటాయి. జాగ్రత్తలు పాటిస్తే చాలు. ఈ వైరస్‌తో అంతగా భయపడాల్సిన అవసరం లేదని ఇప్పటికే పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ సూచించింది.

– డాక్టర్ మనోహర్, డీఎంహెచ్ఓ

క్లుప్తంగా

సంజీవకు ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు


సంజీవకు అవార్డు అందజేస్తున్న హుస్సేన్‌ఖాన్

రామన్నపేట : రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన కాట్రేగు సంజీవ జాతీయ స్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు అందుకున్నారు. ఈనెల 5, 6తేదీల్లో ఏపీ ఐఏఎఫ్ చైర్మన్ హుస్సేన్‌ఖాన్ నేతృత్వంలో ఒడిశాలోని బోండాస్‌లో గిరిజన జాతి సంప్రదాయ వేషధారణ, సంప్రదాయం, నృత్యాలు, జీవనశైలికి సంబంధించిన విషయాలపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన సంజీవకు ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డును అందజేశారు.

కుక్కల దాడిలో దూడ మృతి

చిలుకూరు : కుక్కలు దాడి చేయడంతో దూడ మృతి చెందిన ఘటన మంగళవారం చిలుకూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాగిరెడ్డి కామేశ్వరి ఇంట్లో కట్టేసిన దూడపై 10కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో మృతి చెందినట్లు బాధితురాలు తెలిపారు.

దొంగను చితకబాదిన స్థానికులు

కోదాడరూరల్ : తాళం వేసిన ఇంట్లోకి చొరబడుతున్న దొంగను పట్టుకొని స్థానికులు చితకబాది మంగళవారం పోలీసులకు అప్పగించారు. వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ యువకుడు పట్టణంలోని గోపిరెడ్డినగర్‌లో తాళం వేసిన ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా స్థానికులు గమనించి అక్కడికి వెళ్లారు. వారిని చూసి దొంగ పారిపోతుండగా వెంబడించి పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి అప్పగించారు. వారం రోజుల కిందట శ్రీరంగాపురంలో ఓ రైతు వద్ద రూ.70వేల నగదును అపహరించింది ఇతడే అని స్థానికులు అనుమానిస్తున్నారు. నిందితుడి వద్ద రూ.15వేల నగదు ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నామని తెలిపారు.

అశ్రునయనాల మధ్య శ్రీరామ్ అంత్యక్రియలు

భూదాన్‌పోచంపల్లి : వ్యక్తి వేధింపులతో మనస్తాపం చెంది పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన పర్వతం శ్రీరామ్ అంత్యక్రియలు మంగళవారం అశ్రునయనాల మధ్య జరిగాయి. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ అనంతరం భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లిలో గల స్వగృహానికి కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల తీసుకొచ్చారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. చేతికిఅందివచ్చిన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో వారు రోదించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- 19తులాల బంగారం, పంచలోహ విగ్రహాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడరూరల్ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు ఇళ్లల్లో, ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను మంగళవారం మునగాల పోలీసులు పట్టుకున్నారు. అందుకు సంబంధించిన కేసు వివరాలను కోదాడ పట్టణంలోని డీఎస్పీ కార్యాయంలో డీఎస్పీ శ్రీధర్ రెడ్డి వెల్లడించారు. గత ఏడాది ఫిబ్రవరి 2న మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామంలో గుండు కళావతి తన ఇంటికి తాళం వేసి వివాహానికి వెళ్లింది. ఈక్రమంలో దొంగలు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న మూడున్నర తులాల బంగారం, రూ.20వేల నగదును అపహరించారు. ఈ విషయమై వెంటనే బాధితురాలు మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వాహనాలు తనిఖీ చేస్తుండగా..

సోమవారం సాయంత్రం మునగాల ఎస్‌ఐ జాతీయ రహదారి 65పై మొద్దులచెర్వు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏపీలోని కారంపూడి మండలం మిర్యాలకు చెందిన షేక్ బాబావలి, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన వడ్డే పవన్‌కుమార్, అదే జిల్లా నవాబ్‌పేట మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన సరికొండ మహేష్, నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొత్తపేటకు చెందిన పూర లింగయ్య లారీలో వస్తూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేశారు. వారి బ్యాగుల్లో రెండు పంచలోహ విగ్రహాలతో పాటు బంగారం లభించింది. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా బరాఖత్‌గూడెంతో పాటు వరంగల్ జిల్లా మామునూరు, రఘునాథపాలెం, నకిరేకల్, కేతేపల్లి, తిప్పర్తి, ఖమ్మంటౌన్, ఏపీలోని చంద్రగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇళ్లల్లో, ఆలయాల్లో చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి 19.5తులాల బంగారం, రెండు పంచలోహ విగ్రహాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

మహబూబ్‌నగర్ జైలులో పరిచయమై..

నలుగురు నిందితులలోగతంలో పలువురిపై వారి జిల్లాలతో పాటు మరి కొందరిపై ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, వరంగల్, హైదరాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో పలు దొంగతనాల కేసులు ఉన్నారు. మహబూబ్‌నగర్‌లో నమోదైన కేసులో జైలు శిక్ష పడగా వారికి అక్కడి జైలులో పరిచయమైంది. బయటకు వచ్చిన తర్వాత తిరిగి దొంగతనాలు చేయడం ప్రారంభించారు. నిందితులను పట్టుకోడంలో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్ సీఐ శివకుమార్, మునగాల సీఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది వెంకన్న, శ్రీనివాస్, గురుస్వామి, మల్లేష్, ఆనంద్ సతీష్‌లను ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

కోదాడ : విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలని, ఈ రెండు రంగాలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని ఎమ్మెల్సీ, నల్లగొండ-ఖమ్మం- వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ యూటీఎఫ్ అభ్యర్థి అల్గుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలో వివిధ ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని టీఎస్‌యూ టీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 10శాతం నిధులను కెటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రీ-ప్రైమరీ పాఠశాలల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.500కోట్ల నిధులు ఇవ్వాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను పెంచి విద్యార్థులకు పౌష్టికాహారం అందేటట్లు చూడాలన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తాను శాసనమండలిలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తనను మరోసారి శాసనమండలికి పంపిస్తే ఉద్యోగుల గొంతుకగా ఉంటానని తెలిపారు. అంతకు ముందు పట్టణ పరిధిలోని కేఆర్ఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులను కలిసి తనకు ఓటు వేయాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమాల్లో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పౌర స్పందన వేదిక సభ్యులు ఆర్.ధనమూర్తి, కె.మంగ, నాగేశ్వరరావు, జ్యోతి, పాండురంగాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గిరిజన విద్యార్థికి ఉన్నత విద్య అందాలి

- విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న తెలంగాణ విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

నాగార్జునసాగర్: ఆదివాసీ, గిరిజన బాలబాలికలందరికీ ఉన్నత విద్య అందాలని, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. ట్రైకార్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యనాయక్ ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌లో నిర్వహిస్తున్న జాతీయ వర్క్‌షాప్‌లో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యా హక్కు చట్టం, గ్రామాలు తండాలలో ప్రాథమిక స్థాయి విద్య, ఆశ్రమ పాఠశాలలు తదితర అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో చేరి ప్రతి ఒక్క విద్యార్థి విద్యనభ్యసించేలా గిరిజన నాయకులు కృషిచేయాలన్నారు. అనంతరం మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాన్ని సందర్శించారు. పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలలను సందర్శించి ప్రిన్సిపాల్స్‌తో మాట్లాడారు.

దామరచర్ల స్టేషన్‌లో నిలిచిన రైళ్లు

మిర్యాలగూడ : గుంటూరు నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న ఓ గూడ్స్ రైలు సోమవారం రాత్రి ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడి జిల్లా నడికుడి పొందుగల వద్ద ఒక బోగి పట్టాలు తప్పింది. దీంతో ఈ మార్గం గుండా వెళ్లే తిరుపతి స్పెషల్ రైలు, డెల్టా, చెన్నై ఎక్స్‌ప్రెస్, నర్సాపూర్ రైళ్లతో పాటు పలు రైళ్లు విష్ణుపురంతో పాటు పలు స్టేషన్లలో గంటన్నర సేపు నిలిచిపోయాయి. నంబర్-13 వ్యాగిన్ బోగి పట్టాలు తప్పడంతో అక్కడికి చేరుకున్న రైల్వే అధికారులు మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించారు.

వైకుంఠ ఏకాదశికి ముమ్మరంగా ఏర్పాట్లు


ఉత్తర మాఢ వీధిలో గ్యాలరీ ఏర్పాటులో భాగంగా బిగించిన గ్రిల్స్

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించే వైకుంఠ ఏకాదశికి వీఐపీలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తర రాజగోపురం ముందు భాగంలోని మాఢ వీధిలో మంగళవారం గ్రిల్స్‌ను ఏర్పాటు చేసే పనులకు శ్రీకారం చుట్టారు. అదే విధంగా వీఐపీలు, భక్తులు వేర్వేరుగా కూర్చునేందుకు ప్రత్యేక గ్యాలరీలను సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 9న సాయంత్రానికి పనులు పూర్తి చేసి, వైకుంఠ ఏకాదశికి సిద్ధం చేయనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

ముత్యాలమ్మ ఆలయంలో స్పీకర్ పూజలు


ఆలయంలో శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో రహదారి వెంట ఉన్న ముత్యాలమ్మ ఆలయం వార్షికోత్సవంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన స్థానికులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు సమీప బంధువు కావడంతో ఆయన ఆహ్వానం మేరకు సాగర్‌కు వచ్చినట్లు తెలిసింది. అలాగే నాగార్జునసాగర్‌లో తెలంగాణ రాష్ట్ర ట్రైకార్ కార్పొరేషన్ చైర్మన్ ఆధ్వర్యంలో గిరిజన, ఆదివాసీ సంఘాలకు జాతీయ స్థాయిలో శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఈ తరగతులకు బుధవారం రాష్ట్ర మంత్రి సీతక్క హాజరవుతుండడంతో సాగర్‌కు వచ్చినట్లు సమాచారం. ఆయన వెంట అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, స్థానిక నాయకులు రాంబాబు, నాగరాజు తదితరులు ఉన్నారు.

కోటిన్నరతో వ్యాపారి పరారీ

కోదాడ : బంధువులు, స్నేహితుల వద్ద వ్యాపార నిమిత్తం దాదాపు కోటిన్నర రూపాయలు అప్పుగా తీసుకున్న ఓ ఫ్యాన్సీ దుకాణ యజమాని పరారయ్యాడు. నాలుగు రోజులుగా అతడు అజ్ఞాతంలోకి వెళ్లడంతో అప్పులిచ్చినవారు లబోదిబోమంటున్నారు. వివరాల ప్రకారం.. కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు గ్రామానికి చెందిన ఓ వ్యాపారి కోదాడలోని అనంతగిరి రోడ్డులో 10సంవత్సరాలుగా ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామస్తులు, బంధువులు, తెలిసిన వారి నుంచి అధిక వడ్డీలకు దాదాపు రూ.కోటి 50లక్షలు అప్పు చేశాడు. వాటిని తిరిగి చెల్లించకపోవడంతో ఇటీవల అప్పులిచ్చినవారు ఒత్తిడి తేవడంతో సదరు వ్యాపారి దుకాణం మూసి వేసి అజ్ఞాతంలోకి వెళ్లాడు. సోమవారం బంధువులు అతడిని ఏపీలోని జగ్గయ్యపేటలో ఉండగా గుర్తించి కోదాడకు తీసుకవచ్చారు. వ్యాపారితో బంధువుల మాట్లాడుతుండగా అక్కడకు వచ్చిన ఓ న్యాయవాది అతడిని పక్కకు తీసుకెళ్లి మాట్లాడుతున్నట్లుగా నటించి అక్కడి నుంచి వ్యాపారిని తప్పించినట్లు బాధితులు వాపోతున్నారు. రెండు మూడు రోజుల్లో సదరు వ్యాపారి ఐపి (ఇన్‌సాల్వేషన్ పిటీషన్) దాఖలు చేయనున్నట్లు సమాచారం. ఈ విషయంపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు వెల్లడించారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

- బంగారం, నగదు అపహరణ


మిర్యాలగూడ టౌన్ : చోరీ జరిగిన ఇంట్లో బీరువాను పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

మిర్యాలగూడ టౌన్ : తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు భారీ చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ పిల్లి లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని కృష్ణమాన కాలనీకి చెందిన పందిరి వేణు ఇంటికి తాళం వేసి ఈ నెల 5న కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లాడు. తిరిగి మంగళవారం తెల్లవారుజామున ఇంటికి చేరుకున్నారు. ఇంటి ప్రధాన ద్వారం తలుపులు పగులకొట్టి ఉండడంతో పాటు బీరువా తెరిచి ఉండడాన్ని గమనించి బాధితుడు రూరల్ పోలీస్‌లకు సమాచారం అందించాడు. దీంతో సంఘటన స్థలానికి మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, ఎస్‌ఐ పిల్లి లోకేష్‌లు చేరుకొని బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీరువాలో ఉన్న సుమారు 15తులాల బంగారం, వెండితో పాటు కొంత నగదును అపహరణకు గురైనట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పోలీసులు కేసు నమోదు చేసుకుని నల్లగొండ నుంచి క్లూస్ టీంను రప్పించి నమునాలను సేకరించారు. అనంతరం సీఐ వీరబాబు మాట్లాడారు. దొంగిలించిన వస్తువులను త్వరితగతిన రికవరీ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు.

వేములపల్లిలో ...

వేములపల్లి : తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పోల కల్పన ఈనెల 2న తన తల్లిగారి గ్రామమైన మహబూబ్‌నగర్ జిల్లా చాడబండ గ్రామానికి వెళ్లింది. ఆమె తిరిగి మంగళవారం ఇంటికి చేరుకొని తలుపులు తీసి చూడగా బీరువా తాళం తీసి ఉండడాన్ని గమనించి చూడగా 3తులాల చంద్రహారం, తులం బంగారు ఉంగరాలు, 7 గ్రాముల చెవిదిద్దులతో పాటు రూ.38వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించింది. బాధితురాలు వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది.

గంజాయి కేసులో వ్యక్తి అరెస్ట్

వలిగొండ : ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని అక్రమంగా తరలిస్తూ పోలీసులకు చిక్కకుండా పారిపోయిన వ్యక్తిని మంగళవారం మండల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ యుగంధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి గంజాయిని తరలించేందుకు ప్రయత్నించిన నలుగురు వ్యక్తుల్లో రామన్నపేటలో ఇద్దరు వ్యక్తులను పట్టుకొని రిమాండ్‌కు తరలించగా అదే కేసులో మరో ఇద్దరు వ్యక్తులు తప్పించుకున్నారు. తప్పించుకున్న వారిలో ఒకరు మండలంలోని టేకులసోమారం గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌గా గుర్తించి అతడి ఇంటి వద్ద అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తప్పించుకున్న నాలుగో వ్యక్తి సాయికుమార్ కోసం గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు. గంజాయి అక్రమంగా తరలింపులో ముగ్గురు వ్యక్తులు మండలానికి చెందిన వారు కావడంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గంజాయి రవాణాను అడ్డుకోనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరివేసుకొని వృద్ధురాలు బలవన్మరణం

చిట్యాల : ఓ వృద్ధురాలు బలవన్మరణానికి పాల్పడిన ఘటన పట్టణంలోని వనిపాకల గ్రామానికి వెళ్లే రోడ్డు సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సామ రాంరెడ్డి, ఎల్లమ్మ భార్యాభర్తలు. వారికి ఓ కుమారుడు ఉండగా అతడు ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం రాంరెడ్డి తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. అనంతరం భార్య ఎల్లమ్మ(65) ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. సాయంత్రం పొలం నుంచి రాంరెడ్డి ఇంటికి వచ్చి చూడగా ఎల్లమ్మ మృతి చెంది ఉంది. ఈ విషయాన్ని భర్త రాంరెడ్డి పోలీసులకు తెలిపాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా మృతురాలు ఇటీవల తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ బలవన్మరణానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

చౌటుప్పల్‌లో యువకుడు ఆత్మహత్య

చౌటుప్పల్ : ఉరి వేసుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పట్టణంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని చిన్న కొండూరు రోడ్డులో నివాసం ఉండే గుణమోని శ్రీశైలం (20) స్థానికంగా ఉండే జంగయ్య అనే పూల వ్యాపారి వద్ద పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ఇంట్లోకి వెళ్లిన శ్రీశైలం తలుపులు పెట్టుకుని ఎంతకూ తీయకపోవడంతో అనుమానం వచ్చిన అతడి తమ్ముడు తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా అప్పటికే ఉరి వేసుకొని మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలాన్ని సందర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడి తండ్రి శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.

పనుల్లో నాణ్యత పాటించాలి


సీసీరోడ్డు పనులు పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

పాలకవీడు : జాన్‌పహాడ్ దర్గా వద్ద రూ.65లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని పంచాయతీరాజ్ ఈఈ వెంకటయ్య అన్నారు. మంగళవారం ఆయన అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి పనులను పరిశీలించారు. ఉర్సు సమీపిస్తున్నందున పనులు త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దర్గా వద్ద మరుగుదొడ్లు, స్నానాల గదులు, వసతిగృహాల నిర్మాణాలకు ప్రణాళికలు తయారు చేసి కలెక్టరుకు నివేదించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్, మాజీ జెడ్పీటీసీ మాళోతు బుజ్జిమోతీలాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్ వీ.సుబ్బారావు, పీఆర్ ఏఈ ప్రదీప్, నాగయ్య, శ్రీకాంత్, శేషు, ప్రేమ్‌కుమార్, రాణి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రాజాపేట : మండలంలోని పుట్టగూడెం గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం మండల పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్‌ఐ మైసయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముడావత్ శంకర్ తన ఇంట్లో 20క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా నిల్వచేశాడని సమాచారం రావడంతో దాడులు నిర్వహించి బియ్యం స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్రమాదాల నివారణపై ఐఓసీఎల్ మాక్ డ్రిల్


మాక్‌డ్రిల్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ రవి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కృష్ణారెడ్డి

సూర్యాపేట రూరల్ : ప్రమాదాల నివారణపై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) ఆధ్వర్యంలో మంగళవారం సూర్యాపేట మండలంలోని కాసరబాద సమీపంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ రవి, జిల్లా అగ్ని మాపక అధికారి కృష్ణారెడ్డి పరిశీలించారు. ఆయిల్ పైప్ లైన్‌లు వెళ్లే గ్రామాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలో సిబ్బంది ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రతి సంవత్సరం ప్రజలకు, సిబ్బందికి అవగాహన కల్పించడం అవసరమన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రాజశేఖర్, ఐఓసీఎల్ ఇన్‌చార్జ్ కూనగోపాలకృష్ణ మూర్తి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

బైండోవర్ ఉల్లఘించిన వ్యక్తికి జరిమానా

తిప్పర్తి : బైండోవర్ ఉల్లఘించిన ఓ వ్యక్తికి తహసీల్దార్ రూ.లక్ష జరిమానా విధించారు. తిప్పర్తి ఎస్‌ఐ సాయిప్రశాంత్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజుపేట గ్రామానికి చెందిన సింగం సంతోష్ (23) గత సెప్టెంబర్‌లో వినాయక చవితి ఊరేగింపులో గొడవ చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగించినందుకు మండల పోలీసులు కేసు నమోదు చేశారు. అతడి ప్రవర్తనపై తహసీల్దార్ ఎదుట ప్రవేశపెట్టడంతో మళ్లీ గొడవలు చేయకుండా రూ.లక్ష బైండోవర్ విధించారు. తిరిగి నూతన సంవత్సరం వేడుకల్లో మళ్లీ గొడవలో పాల్గొనడంతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి తహసీల్దార్ ముందు ప్రవేశపెట్టడంతో గత బైండోవర్‌ను ఉల్లఘించినందుకు సంతోష్‌కు తహసీల్దార్ రూ.లక్ష జరిమానా విధించినట్లు తెలిపారు.

'హరిత' ఠాణా

భువనగిరి జిల్లాలోని ఆత్మకూరు(ఎం) మండల పోలీస్‌స్టేషన్‌ను సిబ్బంది నందనవనంలా మార్చారు. స్టేషన్ ఆవరణంలో గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరగడంతో పచ్చదనంతో ఆహ్లాదం పంచుతూ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు చెట్ల కింద ఉన్న బెంచీలపై సేదతీరి వెళ్తున్నారు. - ఆత్మకూరు(ఎం)


చెట్ల నీడన ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలపై సేద తీరుతున్న ఫిర్యాదుదారులు


పోలీస్‌స్టేషన్‌లో ఏపుగా పెరిగిన చెట్లు


పచ్చని చెట్ల నడుమ ఉన్న పోలీస్‌స్టేషన్